# * జీవితం *

* వల్లరి *

డాక్టర్ శర్మ ఆస్పటలు వార్డులన్నీ తనిఖీచేసి, అలసిపోయి, విశ్రాంతిగా ప్రక్కమీద నడుము వాల్చే సరికి రాత్రి 10 గంటలయింది. బ్రహ్మచారి భావాలను ఆలోచిస్తూ, తనభావి జీవితాన్ని తల పోస్తూ, రెండుకునుకులు తీసేసరికి 'టంగు-టంగు—' న గోడగడియారం 12 కొట్టింది. పిండియార బోసినట్టుగా వెన్నెల విరియ బోస్తోంది. ప్రకృతి ప్రశాంతతలో తన్మయత్వం చెందుతూంది. ఆ నిశ్శబ్ధతలో చల్లని మలయమారుతములు పచార్లు చేస్తున్నాయ్. ప్రపంచమంతా హాయి అనుభవిస్తోంది.

అట్టి సమయంలో వున్నతస్థాయిలో భావగర్భితమై, విషాదాంతమైన ఒకపాట కర్ణములకు గోచరమైంది......

ఎందుకో 'The last song of the swan' అనేపదం అప్రయత్నంగా హృదయ కవాటాన్ని కొట్టుకున్నాయ్. ఆ పాట హృదయాన్ని ఆకర్షించి క్రొత్తగా చేరిన రోగి వార్డుకు తీసుకుపోయింది.

"... ... ... ..."

"... ... ... ..."

ఎట్టకేలకు 'నీ హృదయంలో మెసలుతూన్న బాధయేమో తెలుసుకోవచ్చునా !"

అతడు మారుపలుకకుండా, గట్టిగా గొంతు సరిచేసికొని తనకథ చెప్పటం మొదలు పెట్టాడు.

రాత్రులు మునిసిపల్ దీపం క్రింద కూర్చుని పదకొండు గంటలవరకు పాఠాలు చదువుకొనే వాడ్ని. ఆ తరువాత—ఆ పొట్టి గృహం అరుగుమీద వెల్లకిలా పండుకునే వాడ్ని-యేవేవో ఆలోచిస్తూ, అందరాని ఫలాల్ని అనుభవించాలని ఆశిస్తూ—

చీకటిరాత్రులు—ఆ గాఢాంధకారములో ప్రకృతంతా నిగూఢత, నిశ్శబ్దతలో బిక్కు-బిక్కుమంటూం డేది. గబ్బిలాలుమాత్రం రెక్కలాడిస్తూ యెగురుతూం డేవి.

క్రమంగా చీకటిరాత్రులు పేలవమై పోతూం డేవి. చీలిక చీలికలుగా వున్న నల్లని రంగుల్లోంచి చందమామ తొంగి చూస్తూం డేవాడు. చంద్రుని చుట్టూ బంగారుఛాయలు మరింత శోభగూర్చుతూం డేవి. కవులు - కళారాధకులు - ప్రేమికులు - పసిపాపలు...ప్రకృతంతా శీతలాంశుని చల్లని వెన్నెల కిరణాలలో తన్మయులై, మైమరచి, విశ్రాంతి పొం దేవారు. విరహుల నిస్పృహాలు, మూలుగులు కీచురాళ్ళమోతల్లో కలిసిపోయేవి.

నెమ్మది నెమ్మదిగా చీలికలన్నీ ఐక్యమై నిరవకాశమంతా వినీలాకాశ మయ్యేది—ఆ వినీలాకాశంలో క్రొత్తగా మెరుగుపెట్టిన వెండిగిన్నెలా ప్రకాశిస్తూ చంద్రుడు ప్రయాణం చేస్తూం డే వాడు.

ప్రకృతంతా నిద్రాదేవి వొడిలో సుఖించేది. సుషుప్తావస్థలో ఆనందించేది. మందమారుతాలు ఆ నిశ్శబ్దతలో మందగమనాలు చేస్తూం డేవి.

అనంతమైన మధుర భావాలలో మతి విహరిస్తూం డేది. మధ్యమధ్యన తెల్లవారినదని భంగపోయిన కాకుల అరపులు మాత్రం కావుకావు మని వినిపిస్తూం డేవి.

ప్రకృతియొక్క వినిర్మలత, విశాలత, శోభ అందులో అలసటజెందిన మానవ హృదయం పొందే శాంతి, ప్రశాంతత ఆరోజుల్లో అనుభవించ గలిగే వాడ్ని.

కాని—

యెంతమార్పు !

... ... ... ...

... ... ... ...

తిరిగి మరొకసారి గొంతుసవరించుకొని, అవలించి కథ చెప్పటం మొదలు పెట్టాడు.

"నా నిత్యజీవితపు సరణియే మారిపోయింది. మానసిక స్వాతంత్ర్యం నశించి, నిబంధనలనే పురిత్రాళ్ళు యేర్పడ్డాయ్. స్వేచ్ఛ, విశ్రాంతి, విరామం లేకుండా నాజీవిత సర్వస్వాన్ని ఒకరి చెప్పుచేతల్లో ఉంచవలసి వచ్చింది. ఒకరి ఆజ్ఞకు పూర్తిగా బద్ధుడనై —

ప్రొద్దున్నే 8 గంటలకి ఆఫీసుకి హాజరవ్వాలి. పైన నెత్తీ, క్రింద కాళ్ళూ మాడుతూంటే వొంటిగంటకు భోజనానికి రెండుమైళ్ళు నడిచిరావాలి. వెంటనే తిరిగి వెళ్ళాలి రెండుమైళ్ళూను. ఆ కారెండలో తిరిగి ఇల్లు చేరుకొనే సరికి చాలాపొద్దుపోయేది.

ఇలా రోజుకు సరాసరి 8 మైళ్ళు నడచి— ఎండనక, వాననక కష్టానికి ప్రతిఫలం ముప్పైరూపాయల కూలి. ఆ కొద్దిరూకలతో నెల్లాళ్ళు గడపాలి—గౌరవప్రదంగా – అయిదుగురు గల సంసారం—ఈ కరువు రోజుల్లో.

జీవితం! అటు కేవలం బీదకాక — ఇటు గొప్పకాక—సంఘంలో, కులంలో, పూళ్ళో, కొంచెం గౌరవంగా తిరుగవలసిన మధ్యరకపు మానవుని జీవితం - హా - జిందగి!

కిటికీలోంచి—నిర్మలాకాశంలోని మినుకు మినుకు మనే నక్షత్రాల్ని తిలకిస్తూ తిరిగి చెప్పటం మొదలు పెట్టాడు బరువుగా.

అసలు నేనెందుకు చదువుకున్నానీ బానిస విద్య! ఎందుకు పరీక్ష ప్యాసయ్యాను!!

పచ్చగా పెరిగిన పచ్చిక బయలులందు మేయు ఆలమందలను కాయు గొల్లవాని జీవితమెంత ఆనందమైనది! స్వేచ్ఛా వాయువులందు—నదీ తరంగముల నుండి వచ్చెడి చల్లని వాయుతరంగముల నాస్వాదించుచు, మఱ్ఱివూడలందు కూర్చుని మంజులంబైన వేణునాధమును వాయించి ప్రకృతి పులకింపజేయు ఆ నిరక్షరుడైన గోపకుని జీవిత మెంత హాయి ఐనది! ఎట్టి ఆనంద తమము!!

నాకు అట్టి రాగమూర్ఛనల్ని ఆలించేందుకు సావకాశం శూన్యం.

నాకు సెలవు అనేది లేదు. ఒక ఆదివారమని—చివరకి పండుగలకి కూడ సెలవనేది సున్న. కాని ఇప్పుడు నాహృదయములో కలవరము జెందుచున్న బాధను తెలిపేందుకు అవకాశము దొరికింది. ఎందువలన?—శరీర మానసిక స్థితి చెడి పూర్తిగా కదిలేందుకు కూడా అశక్తుడ్ని చేయుటవల్ల!

అంతతో ఆపివేశాడు. తలగడనుండి నడుము జార్చి పండుకొన్నాడు. ఎట్టి ఉపశమన సమాధానం చెప్పాలో తెలియక పూరుకొన్నాడు డాక్టర్— ...బరువైన దీర్ఘనిశ్వాస మొదటి విడిచాడు ఆ బాధాజీవి—మినుకు మినుకు మనే నక్షత్ర మొకటి రాలి పడిపోయింది. అతడు జీవితంనుండి సంపూర్ణ విశ్రాంతి తీసికొన్నాడు.

పాపం—నిరాశ జెందిన జీవితం శాంతి - విరామం కోరుతుంది.

అలసిన హృదయం తనబాధను ఎదుటి వార్ని ఆలకించ మంటుంది. రెండు వేడికన్నీటి బిందువుల నాశిస్తుంది. వారితోబాటు 'నిస్సు' మని వేడినిట్టూర్పొకటి విడవాలని కోరుతుంది—వారి సానుభూతిని విని ఆత్మ శాంతిని పొందగోరుతుంది—పాపం!

On some fond breast the parting soul relies.

Some pious drops the closing eye requires.

అన్న Gray కవి పలుకులు గుర్తుకొచ్చాయ్.

అభిలాష, సామర్థ్యతను బట్టి శిక్షణ యిచ్చే విద్యావిధానము లేక పోవడము ఒక కారణమేమో ఆ బాధాజీవి తాత్పర్యం!!!